సాక్షి నిర్మల్

ఆదివారం । 10 । ఆగస్టు । 2025

గరిష్ఠం/కనిష్ఠం
31.3 /24.4

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాఖీ కట్టి.. అభిమానం చాటుకుని..


హరీశ్‌రావుకు రాఖీ కడుతున్న మహిళలు

సోన్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావుకు మండలంలోని న్యూ వెల్మల్ గ్రామానికి చెందిన నాయకులు దావ మల్లయ్య, వర్ధినేని కిరణ్‌రావు దంపతులు శనివారం రాఖీపౌర్ణమి సందర్భంగా రాఖీ కట్టి తమ అభిమానం చాటుకున్నారు. హైదరాబాదులోని హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిశారు. మాజీ మంత్రికి రాఖీ కట్టడం సంతోషంగా ఉందని తెలిపారు.

రేపు అల్బెండజోల్ మాత్రలు వేయాలి

- ఇన్‌చార్జి డీఈవో పరమేశ్వర్

నిర్మల్ రూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం అల్బెండజోల్ మాత్రలు వేయాలని ఇన్‌చార్జి డీఈవో పరమేశ్వర్ సూచించారు. అన్ని విద్యాసంస్థలు భాగస్వామ్యమై 100% మాత్రలు వేయించాలని పేర్కొన్నారు. ప్రతీపాఠశాలలో ఒక ఉపాధ్యాయున్ని కార్యక్రమ పర్యవేక్షణకు నోడల్ అధికారిగా నియమించాలని తెలిపారు. ఉపాధ్యాయులు ఆ తరగతికి సంబంధించిన విద్యార్థులు మాత్రలు వేసుకునేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు మాత్రలు వేస్తున్నామనే సమాచారాన్ని ముందస్తుగా తెలియజేయాలని సూచించారు.

రైతులు కదిలి.. మరమ్మతు చేసి..


మరమ్మతులు చేస్తున్న రైతులు


మామడ: చెరువు నుంచి పంటలకు నీటిని అందించేందుకు తూము వద్దకు వెళ్లి చూడగా నీరు రాలేదు. గ్రామంలోని రైతులు అందరూ కదిలి తూముకు మరమ్మతులు నిర్వహించారు. చెరువు నీటిని కాలువకు వదిలారు. మండలంలోని పొన్కల్ చెరువు తూము అడుగు భాగంలో రాళ్లు ఉండటంతో గేటును తీసి నీటిని కాలువలోకి అందించడం ఇబ్బందిగా మారింది. దీంతో రైతులందరూ చెరువు వద్దకు వెళ్లి రాళ్లను తొలగించి నీటిని కాలువలోకి వదిలారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గంగారెడ్డి, ఉమేశ్, రైతులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో బంగారు పతకం


మెడల్ అందుకుంటున్న వైభవి

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన అనుముల అమర్ కుమార్–లావణ్య దంపతుల కుమార్తె వైభవి జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటింది. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 2 నుంచి 7వ తేదీ వరకు ముంబైలో నిర్వహించిన జాతీయస్థాయి అండర్–13 బాలికల డబుల్స్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి బంగారు పతకం సాధించింది. వైభవిని రవి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్‌రాణి అభినందించారు.

ఖానాపూర్‌లో దంచికొట్టిన వాన


నిలిచిన రాకపోకలు

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి, తర్లపాడ్, బీర్నంది, పాత ఎల్లాపూర్ తదితర గ్రామాల్లో శనివారం సుమారు రెండు గంటలపాటు వర్షం దంచికొట్టింది. అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి మండలంలోని పాత ఎల్లాపూర్ ఒడ్డెవాడ నుంచి బీర్నంది గ్రామానికి వెళ్లే మార్గంలోని కొమ్ముతండా సమీపంలో గల చింతొర్రె ఉప్పొంగింది. క్యాజ్‌వే పైనుంచి వరద ప్రవహించడంతో సుమారు గంటపాటు ఎర్వచింతల్, బీర్నంది, రంగపేట్ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

ఉద్యమ దిశగా..


సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నినదిస్తున్న విద్యావంతులు

- విశ్వవిద్యాలయం కోసం పోరాటం..
- అన్నివర్గాలతో యూనివర్సిటీ సాధన సమితి..
- జిల్లాలో చర్చనీయాంశంగా 'సాక్షి' డిబేట్
- మహిళా డిగ్రీ కాలేజీపై స్పందించిన కలెక్టర్

నిర్మల్: జిల్లాలో యూనివర్సిటీ సాధన కోసం ఉద్యమదిశగా అడుగులు పడుతున్నాయి. ఉన్నతవిద్య జిల్లావాసులకు అందుబాటులో ఉండాలన్న అంశంపై 'సాక్షి' నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం విద్యావంతులు, జిల్లావాసుల్లో కదలిక తీసుకువచ్చింది. విశ్వవిద్యాలయం కోసం సాధన సమితి పేరిట ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నారు. అన్నిసంఘాలు, వర్గాలు సమష్టిగా సాధనోద్యమం సాగాలని నిర్ణయించారు.

'వర్సిటీ'పై కదలిక..

'ఇంకెన్నేళ్లు ఈ దుస్థితి.. మన ప్రాంతానికి విద్యావైభవం ఎప్పుడూ..!?' అన్న ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. ఇదేక్రమంలో ఇటీవల 'సాక్షి' జిల్లాలో ఉన్నతవిద్యపై నిర్లక్ష్యం, ప్రత్యేక యూనివర్సిటీ ఏర్పాటు అవశ్యకత అంశాలపై వరుస కథనాలను ప్రచురించింది. విద్యావంతులతో 'రౌండ్‌టేబుల్ సమావేశం' నిర్వహించింది. ఈ సమావేశం జిల్లాలో ఉన్నతవిద్య ఉన్నతీకరణ జరగాలన్న అంశాన్ని లేవనెత్తడంతో అన్నివర్గాల్లో కదలిక వచ్చింది.

సాధన సమితిగా..

చదువులతల్లి కొలువైన జిల్లాలో 'జ్ఞానసరస్వతీ యూనివర్సిటీ సాధన సమితి' పేరిట విశ్వవిద్యాలయం సాధించేదాకా ఉద్యమించేందుకు జిల్లా సిద్ధమవుతోంది. 'ఫైట్ ఫర్ రైట్..' అంటూ విద్యావంతులు, విద్యార్థి, ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగ, రిటైర్డ్ ఉద్యోగ సంఘాలు కలిసి 'యూనివర్సిటీ సాధన సమితి'ని రూపకల్పన చేశాయి. త్వరలో కార్యాచరణ ప్రకటించేందుకు సన్నద్ధమవుతున్నాయి.

కీలకంగా.. పీజీసెంటర్

జిల్లాలో యూనివర్సిటీ డిమాండ్‌లో ఇక్కడి కాకతీయ పీజీసెంటర్ కీలకంగా మారింది. దివంగత సీఎం వైఎస్సార్ ఏర్పాటు చేసిన కొత్త వర్సిటీలలో గతంలో పీజీసెంటర్‌లుగా ఉన్నవే. తాజాగా జిల్లాలోనూ పురుడుపోసుకున్న విశ్వవిద్యాలయ సాధనోద్యమంలోనూ ఇదే కీలకం కానుంది. జ్ఞానసరస్వతీ విశ్వవిద్యాలయ సాధన సమితి వ్యవస్థాపకుడు నంగె శ్రీనివాస్ సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే ఈ విషయాన్ని ఆయన దృష్టి తీసుకెళ్లడంతో అప్పట్లోనే సానుకూల స్పందన వచ్చింది. తర్వాత మూలనపడినా.. ఇప్పుడు మళ్లీ యూనివర్సిటీ ఏర్పాటు డిమాండ్ ఊపందుకుంది.

'మహిళా డిగ్రీ'పై స్పందించిన కలెక్టర్

జిల్లాకేంద్రంలో 2009–10 విద్యాసంవత్సరంలో ఏర్పాటైన మహిళా డిగ్రీ కళాశాలను 2016–17లో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు తరలించారు. ఈవిషయం చాలామంది పాలకులు, నాయకులు, విద్యావంతులకూ తెలియకపోవడం గమనార్హం. ఇదేవిషయాన్ని ఇటీవల జిల్లాలో ఉన్నతవిద్య తీరుపై వరుస కథనాల్లో భాగంగా ఈనెల 6న 'ఉన్నత విద్య..ఉత్తదే' శీర్షికన 'సాక్షి దినపత్రిక' ప్రచురించింది. దీనిపై కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందించారు. మహిళా డిగ్రీ కళాశాల తరలింపుపై స్థానిక ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరారు. ఈమేరకు ఆయన నిర్మల్ జిల్లాలో రెసిడెన్షియల్ మహిళా డిగ్రీకళాశాల ఏర్పాటు కావడం, అలాగే జిల్లాకో డిగ్రీకాలేజీ ఉండాలన్న నిబంధనలో భాగంగానే కాకతీయ యూనివర్సిటీ తరలింపు చేపట్టినట్లు వివరించారు.

'రక్ష'గా నిలవాలి..


ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు రాఖీ కడుతున్న సోదరి శాంతబాయి


నాయుడు పేటలో అన్నకు రాఖీ కట్టి మిఠాయి తినిపిస్తున్న చిట్టి చెల్లెలు

జిల్లాలో రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. అక్కాచెల్లెళ్లు అన్నదమ్ములకు 'నీవు నాకు రక్ష, నేను నీకు రక్ష' అంటూ రాఖీలు కట్టారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లను సోదరులు ఆశీర్వదించి కానుకలు అందించారు.


నిర్మల్‌లో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క, చెల్లి..


అక్క ఉదయశ్రీతో రాఖీ కట్టించుకుని సెల్ఫీ తీసుకుంటున్న నిజామాబాద్ సీఐ సాదుల సతీశ్


నిర్మల్ పట్టణంలో అక్కలతో రాఖీలు కట్టించుకుంటున్న తమ్ముళ్లు

కూలీలకు 'భరోసా' ఏది?

- అమలుకాని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం
- లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా అందని ఆర్థికసాయం
- వ్యవసాయ కూలీలకు తప్పని ఎదురుచూపు



జిల్లా వివరాలు:
మొత్తం మండలాలు 18
గ్రామపంచాయతీలు 396
పైలెట్ ప్రాజెక్టులో లబ్ధి పొందినవారు 688
గ్రామసభకు పంపిన అర్హుల జాబితా 29,306
గ్రామసభలో అర్హత పొందిన వారు 27,446
గ్రామ సభలో వచ్చిన దరఖాస్తులు 6,871
అర్హత పొందిన వారు 1,242

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం తన ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా భూమిలేని వ్యవసాయ కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. ఈ సాయం రెండు విడతల్లో అందించేలా నిర్ణయించింది. జిల్లాలో ఈ పథకం అమలు ఆలస్యం కావడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని 18 మండలాల్లో ఒక్కో గ్రామ పంచాయతీని ఎంపిక చేసి, జనవరి 26న మంజూరు పత్రాలు అందజేశారు. ఈ 18 గ్రామాల్లో 688 మంది లబ్ధిదారులకు మొదటి విడతగా రూ.6 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అయితే, రెండో విడత సాయం అందాల్సిన సమయం దాటినా, ఇప్పటి వరకు అందలేదు. మిగిలిన గ్రామాల లబ్ధిదారులకు ఈ సాయం ఎప్పుడు అందుతుందనే దానిపై అధికారుల నుంచి స్పష్టత లేదు.

లబ్ధిదారుల ఎంపిక..

ఈ పథకం కింద భూమిలేని, ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసిన కూలీలు అర్హులుగా నిర్ణయించారు. జిల్లాలోని 396 గ్రామాల నుంచి 27,446 మంది లబ్ధిదారులను ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎంపిక చేశారు. అయినా కేవలం 688 మందికి మాత్రమే మొదటి విడత సాయం అందడంతో మిగిలిన లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. పైలెట్ ప్రాజెక్టు గ్రామాలకే సాయం పరిమితమైన నేపథ్యంలో, మిగిలిన లబ్ధిదారులకు ఎప్పుడు ఆర్థిక సాయం అందుతుందనే సమాచారం అధికారులు తెలుపడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులందరికీ 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' సాయం అందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ పవర్

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు ఉపముఖ్యమంత్రి, ఫైనాన్స్, ప్లానింగ్, ఎనర్జీ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. జిల్లాల వారీగా ప్రభుత్వ భవనాల వివరాలు, నెలవారీ విద్యుత్ వినియోగం, బిల్లులను వారంలోగా సమర్పించాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఇతర శాఖ భవనాలపై కూడా సౌర ఫలకాలు అమర్చనున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, టీజీ రెడ్‌కో ఎండీ ఎల్.శ్రీనివాస్, ఏపీడీ నాగవర్ధన్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రభాకర్ పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, జిల్లా అధికారులు

వృక్షాబంధన్ జరుపుకోవాలి

- డెప్యూటీ రేంజ్ అధికారి నజీర్‌ఖాన్

సారంగాపూర్: నేను నీకు రక్షా.. నీవు నాకు రక్షా మనిద్దరం దేశానికి రక్ష అంటూ రక్షాబంధన్ పండుగను జరుపుకోవడంతోపాటు వృక్షాలను, అడవులను రక్షించుకునేందుకు వృక్షాబంధన్ పండుగను సైతం జరుపుకోవాలని డీఆర్‌వో నజీర్‌ఖాన్ అన్నారు. మండలంలోని అడెల్లి మహాపోచమ్మ నందనవనంలో స్థానిక ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ ఆధ్వర్యంలో విద్యార్థులు, అటవీశాఖ అధికారులు శనివారం వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, అటవీశాఖ సిబ్బంది నందనవనంలో ఉన్న పెద్దపెద్ద మొక్కలకు, విద్యార్థులు, సిబ్బంది కలిసి నాటిన మొక్కలకు రాఖీలు కట్టారు. మొక్కలు నాటి వాటిని రక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. నజీర్‌ఖాన్ మాట్లాడుతూ వృక్షాలను మనం రక్షిస్తే అవి మనకు ప్రాణవాయువును ఇచ్చి రక్షిస్తాయని అన్నారు. అందుకే ప్రతీవిద్యార్థి తమ తల్లిదండ్రులు, బంధువులకు సైతం ఈ సూక్తి అమలు చేసేలా చూడాలని తెలిపారు. అనంతరం వాల్టా, ఇతర అటవీశాఖ చట్టాలను వివరించారు. అలాగే నందనవనంలో పెరిగిన ప్రతీ మొక్క శాస్త్రీయ నామంతోపాటు వాటి వాడుక పేర్లు, వాటితో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, ఔషధ మొక్కల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో సారంగాపూర్ మండల అటవీశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కలకు రాఖీ కడుతున్న విద్యార్థినులు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

దేశాన్ని, ధర్మాన్ని రక్షించాలి

- ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవాహ దిగంబర్

కుభీర్: దేశం, ధర్మ రక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఆర్‌ఎస్‌ఎస్ నాలుగు జిల్లాల కార్యవాహ రాజుల దిగంబర్ అన్నారు. కుభీర్ శ్రీవిఠలేశ్వర మందిరంలో శనివారం నిర్వహించిన రక్షాబంధన్ వేడుకల్లో మాట్లాడారు. హిందువులలో ఐక్యత లేని కారణంగా మన దేశాన్ని 800 సంవత్సరాలు మొఘలులు, 200 ఏళ్లు బ్రిటిషర్లు పాలించారన్నారు. హిందువులలో ఐక్యత కోసం 1925లో డాక్టర్ కేశవ్‌రావ్ బలిరాంపంత్ హెడ్గేవార్ ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించారన్నారు. పర్యావరణ రక్షణకు అందరూ మొక్కలు నాటాలన్నారు. కులతత్వం విడనాడి అందరూ సమానమేననే భావనతో మెలగాలన్నారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేస్తూ దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. అనంతరం స్వయంసేవకులు రాఖీలు కట్టుకున్నారు. అర్గుల సాయినాథ్, డాక్టర్ పెంటాజీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పోశెట్టి, శ్రీనివాస్, శివలింగు, హన్మాండ్లు, రాజు, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దిగంబర్

ఫీజు కట్టినా.. రెగ్యులరైజ్ కాలే!

- లబ్ధిదారులకు అందని ప్రొసీడింగ్స్
- యాజమాన్య హక్కుల కోసం తప్పని నిరీక్షణ
- 6,841 మంది ఫీజు చెల్లిస్తే 2,460 మందికే ప్రొసీడింగ్స్



జిల్లాలోని మొత్తం దరఖాస్తులు	44,602
సమకూరిన ఆదాయం	రూ.15.20కోట్లు
మూడు మున్సిపాలిటీలలో	26,537
ఫీజుకు అర్హత పొందిన వారు	21,850
ఫీజు చెల్లించినవారు	3,611
ఫీజు చెల్లించాల్సిన వారు	18,239
ప్రొసీడింగ్ అందినవారు	2,460
ప్రొసీడింగ్ అందాల్సినవారు	1,151
18 మండలాల పరిధిలో	18,065
ఫీజుకు అర్హత పొందిన వారు	16,089
ఫీజు చెల్లించినవారు	3,230
ఫీజు చెల్లించాల్సిన వారు	12,859

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో లే–అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) కింద స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నవారు యాజమాన్య హక్కుల కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. అన్ని అడ్డంకులను అధిగమించి, నిర్దేశిత ఫీజులు చెల్లించినా ప్రొసీడింగ్స్ జారీలో జాప్యం కారణంగా దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ పథకం ఇలా..

గతంలో అనుమతి లేకుండా లే–అవుట్‌లు ఏర్పాటు చేసి వెంచర్లు నిర్మించినవారు చాలామంది ఉన్నారు. ఈ విషయం తెలియక స్థలాలు కొనుగోలు చేసిన యజమానులకు ఊరట కల్పించేందుకు, గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2020లో మున్సిపల్ శాఖ జీవో 131 జారీ చేస్తూ, ఆగస్టు 26, 2020కి ముందు స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ క్రమంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో స్థల క్రమబద్ధీకరణ కోసం రూ.1,000 చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తులు సమర్పించారు.

మూడు దశల్లో పరిశీలన..

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మూడు దశల్లో పరిశీలించేలా అధికారులు నిర్ణయించారు.

- స్టేజ్–1: అర్బన్ ఏరియాల్లో టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు, అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలిస్తారు. రెవెన్యూ అధికారులు స్థల వివరాలను, నీటిపారుదల శాఖ అధికారులు శిఖం భూముల్లో ఏమైనా ఉన్నాయా అని తనిఖీ చేశారు.
- స్టేజ్–2: టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కంటే ఉన్నతస్థాయి అధికారి దరఖాస్తుతో జతచేసిన పత్రాలను పరిశీలిస్తారు. ప్లాట్‌లలో ఇల్లు నిర్మించినట్లయితే, సంబంధిత పట్టా అందజేయాల్సి ఉంటే దాని గురించి సమాచారం ఇస్తారు.
- స్టేజ్–3: మున్సిపల్ కమిషనర్ దరఖాస్తులు, పత్రాలను మరోసారి సమీక్షించి, నిర్దేశిత ఫీజును చలానా రూపంలో చెల్లించాలని దరఖాస్తుదారులకు సూచిస్తారు.

రూ.15.20 కోట్ల ఆదాయం..

అన్నీ సక్రమంగా ఉన్నవారికి ఫీజు చెల్లించి రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం కల్పించింది. తాజాగా ప్రభుత్వం ఫీజులోనూ రాయితీ కల్పించింది. నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలు, 18 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 44,602 దరఖాస్తులు స్వీకరించగా, వీటిలో 37,939 దరఖాస్తులు ఫీజు చెల్లింపునకు అర్హత సాధించినట్లు నిర్ధారించారు. ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించిన నేపథ్యంలో, 6,841 మంది ఫీజులు చెల్లించారు. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల ద్వారా ప్రభుత్వానికి జిల్లా నుంచి సుమారు రూ.15.20 కోట్ల ఆదాయం సమకూరింది.

ప్రొసీడింగ్స్ కోసం నిరీక్షణ..

ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఐదేళ్లుగా ప్రక్రియ పూర్తి కాకపోవడంతో దరఖాస్తుదారులు నిరాశలో ఉన్నారు. ప్రభుత్వం పది రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టినప్పటికీ, నెలలు గడుస్తున్నా 6,841 మంది ఫీజు చెల్లించిన వారిలో కేవలం 2,460 మందికి మాత్రమే ప్రొసీడింగ్స్ జారీ అయ్యాయి. సిబ్బంది కొరత, దరఖాస్తులను మరోసారి పరిశీలించాల్సిన అవసరం వంటి కారణాలతో ఈ ఆలస్యం జరుగుతోందని అధికార వర్గాలు తెలిపాయి.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

నిర్మల్ టౌన్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ జేఏసీ కన్వీనర్ మంద మల్లేశ్, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకయ్యగారి భూమయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆదివాసీల హక్కులను కాపాడాలని, వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక టీఎన్జీవో భవనం నుంచి అంబేడ్కర్ చౌరస్తా, కుమురంభీం, రాంజీగోండు విగ్రహాల వరకు సాగింది. విగ్రహాలకు పాలాభిషేకం చేసి, జెండాలు ఆవిష్కరించారు. అనంతరం టీఎన్జీవో భవనంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీ మ్యూజియం ఏర్పాటు చేయాలని, ఆదివాసీ విద్యార్థుల కోసం ప్రత్యేక కోచింగ్ సెంటర్ ప్రారంభించాలని కోరారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఇచ్చిన పట్టాలపై సాగు చేసుకులా ఆదివాసీలకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మారుమూల గూడేలకు రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆదివాసీ దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు శంభు, నైతం భీమ్‌రావు, తోడుసం గోవర్ధన్, సుంచు శ్రీనివాస్, సాకి లక్ష్మణ్, సూరపు సాయన్న,


సభలో నినదిస్తున్న ఆదివాసీ నాయకులు

ఆదివాసీ యోధుల స్ఫూర్తితో ..

నిర్మల్‌చైన్‌గేట్: ఆదివాసీ యోధుల స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఆదివాసీ నాయకపోడ్ ఉద్యోగ సంఘం, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ముచ్చిండ్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి అనుగొండ సతీశ్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ వీరులు కుమురంభీం, రాంజీగోండు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసుల ఆత్మగౌరవం, సంస్కృతి, హక్కుల పరిరక్షణ కోసం సంఘం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలోనాయక పోడ్ ఉద్యోగ సంఘ సభ్యులు కస్తూరి భీమేశ్వర్, సొండి శివ శంకర్, బాపయ్య, గుండంపల్లి సాయన్న, గురుడు సునీల్, పోశెట్టి ముత్తన్న, బాలాజీ, గంపల భూమేష్, రాజేశ్వర్, కాల శంకర్, పిరాజి పాల్గొన్నారు.


కుమురంభీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నాయకపోడు సంఘం అధ్యక్షుడు శంకర్, ఆదివాసి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవి, కార్యదర్శి సతీశ్, ఎల్లయ్య, పోతురాజ్ శ్రీనివాస్, భీమేశ్, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీసీ సంఘాలు ఏకతాటిపైకి రావాలి

నిర్మల్‌టౌన్: రాష్ట్రంలోని జాతీయ, రాష్ట్ర బీసీ సంఘాలు ఏకతాటిపైకి రావాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం కన్వీనర్ కోదూరి చంద్రయ్య శనివారం కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఏర్పాటు చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమవంతు ప్రయత్నం చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు 10 శాతం తొలగించాలని అంటుందని తెలిపారు. దీనిని బీసీ సంఘాలు పరిశీలించి, వెంటనే స్పందించి రిజర్వేషన్ల సాధనకు కార్యాచరణ రూపొందించాలని కోరారు.

క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మండలంలోని అంతర్రాష్ట్ర వంతెన సమీపంలోని ప్రాణహిత నదిలో నుంచి శనివారం తెల్లవారు జామున ఇసుక తరలిస్తున్న రెంటు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. వెలమపల్లికి చెందిన గోనె సత్యనారాయణ, మానిశెట్టి ప్రశాంత్‌తో పాటు డ్రైవర్లు అట్టెల వెంకటేశ్, జగన్‌పై కేసు నమోదు చేసి వాహనా లను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

సోన్: వృద్ధురాలిపై కోతులు దాడి చేసిన సంఘటన శనివారం మండలంలోని న్యూ వెల్మల్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోపు సాయవ్వ తన ఇంటి ముందు నిద్రపోతుండగా కోతులు ఒక్కసారిగా దాడి చేయడంతో తల, మెడపై గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌లోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోతుల బారి నుండి తమను రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన యువతి (25) తల్లి మందలించడంతో శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో ఆమె తండ్రి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో వ్యభిచారం గృహంపై శనివారం దాడి చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన చేతన్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో ఓ ఇంటిని కొన్ని నెలల క్రితం నుంచి అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆ ఇంటికి పలువురు పురుషులు, మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో అనుమానం కలిగిన కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో ఆ గృహంపై దాడి చేసి చేతన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఆటో


చెట్ల పొదల్లో ఆటో

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని హరిత వనం పార్కు సమీపంలో చెట్ల పొదల్లోకి ఆటో దూసుకెళ్లి బోల్తా పడింది. సిర్పూర్ మండలం చిలాటిగూడకు చెందిన ప్రయాణికులు మహారాష్ట్రలోని మహూర్ గ్రామానికి దైవదర్శనం కోసం ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శనివారం మావల సమీపంలో ఆటో చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న దేవ్‌రావు, మారుతి, మంగావతి, నాగోబాయికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఈఎంటీ కిషన్, పైలట్ ముజఫర్ క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

తండాల్లో తీజోత్సవం

- గిరిజన గ్రామాల్లో మొదలైన సందడి
- పెళ్లికాని యువతులు నిర్వహించే పండుగ


గోధుమ నారుకు నీళ్లు చల్లుతున్న యువతులు

కెరమెరి : తీజ్.. గిరిజన తండాల్లో తేజాన్ని నింపే పండుగ. గిరిజన యువతులు తమ ఆశలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ తొమ్మిది రోజుల పాటు ఉత్సాహంగా నిర్వహించుకునే ఉత్సవం. ఆటపాటలు, విందులు, వినోదాలు, వినూత్న ఆచారాలతో బతుకమ్మ తరహాలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే ఈ వేడుకలు గిరిజన బంజారా (లంబాడా) తండాల్లో రక్షాబంధన్‌కు ప్రారంభమై కృష్ణాష్టమికి ముగుస్తాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శనివారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

వేడుకల్లో నిమగ్నం..

గిరిజన లంబాడాలు తమ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా పండుగలు జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాఖీ పౌర్ణమి నుంచి లంబాడా గిరిజనులంతా 'తీజ్' పండుగ జరుపుకోవడంలో నిమగ్నమయ్యారు. యువతులు కుల దేవతలను కొలుస్తూ బుట్టల్లో ఎర్రమట్టి నింపి అందులో గోధుమలు చల్లారు. వీటినే తీజ్ బుట్టలు అంటారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని 'తీజ్ భరాయిరో' అని పిలుస్తారు. ఆ రోజు నుంచి యువతులంతా నియమ నిష్టలు పాటిస్తున్నారు. గ్రామ ప్రజలకు మంచి జరగాలని, తమకు మంచి భర్త రావాలని కోరుకుంటూ ఉపవాస దీక్షలు ప్రారంభించారు. ప్రతీరోజు మూడు పూటలా సమీపంలోని బావుల వద్దకు వెళ్లి నీటిని తీసుకువచ్చి బుట్టలపై చల్లుతున్నారు. ఆరు రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

ఏడో రోజు 'ఢమోళీ' సందడి

ఏడో రోజున ప్రతీ ఇంట్లో బియ్యపు పిండితో రొట్టెలు చేస్తారు. వాటిని బెల్లం, నెయ్యితో కలుపుతారు. ఈ మిశ్రమాన్నే చూర్మా అంటారు. ఈ చూర్మాను తీజ్ బుట్టలున్న ఇంటి ఆవరణలో నెలకొల్పిన కుల దేవుడు 'సేవాభయ్యా'కు నైవేద్యంగా సమర్పిస్తారు. అదే రోజు ఇంటి సింహద్వారానికి ఎదురుగా జొన్నలతో నింపిన గోనె సంచులు, వాటి ముందు నీళ్ల కడవ ఉంచి అందులో వేప మండలు పేరుస్తారు. ఆ కడవ ముందు జొన్నపిండితో ముగ్గులు వేస్తారు. వాటి మధ్య వెండితో తయారు చేసిన 'మేరామయాడి' తల్లి విగ్రహాన్ని ఉంచి దీపం వెలిగించి పూజలు చేస్తారు. మేరామయాడి దేవత మాంసాహారి కావడంతో ఆమెకు మేకపోతును బలిస్తారు. ఆరోజు రాత్రి యువతులు ఇంటింటికీ వెళ్లి చూర్మా సేకరిస్తారు. వర్షసైన వారికి పూస్తూ నృత్యం చేయడంతో సందడి వాతావరణం నెలకొంటుంది. ఈ కోలాహల ప్రక్రియనే 'ఢమోళీ'గా వర్ణిస్తారు.

ఎనిమిదో రోజు 'ఘంగోర్' వివాహం

ఎనిమిదో రోజు యువతులంతా చెరువు వద్దకు వెళ్లి మట్టిని తీసుకొస్తారు. ఆ మట్టితో ఆడ, మగ బొమ్మలను తయారు చేస్తారు. ఆడ బొమ్మకు గాంగ్రి, మగ బొమ్మకు ధోవతి, లాల్చీతో వేషధారణ చేస్తారు. వాటిని మేళతాళాలతో తీజ్‌లు ఉన్న చోటుకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. అక్కడ ఆ బొమ్మలకు ఘనంగా వివాహం జరిపిస్తారు. అక్కడే లాప్సీ (పాయసం) తయారు చేసి ఉత్సవ ప్రతిమలకు నైవేద్యంగా సమర్పిస్తారు. 'గణ' అంటే వారి కులదేవత 'మేరామయాడి' అని 'గోర్' అంటే కుల దేవుడు సేవాభయ్యా అని గిరిజనులు పిలుస్తుంటారు. వారిరువురికి ఈ రోజు పెళ్లి చేసినట్లు చెప్పుకుంటారు.

తొమ్మిదో రోజు..

తొమ్మిదో రోజును 'తీజ్ తోడేరో దాడో' అని పిలుస్తారు. ఆ రోజు యువతులంతా ఇంటింటికీ వెళ్లి తీజ్‌లను తెంపడానికి అందరూ రావాలని ఆహ్వానిస్తారు. వారంతా వచ్చిన తర్వాత మంచె పైనున్న తీజ్ బుట్టలను కిందికి దించుతారు. కులదేవతలను పూజిస్తూ 'తీజ్' నారును తెంపుతారు. దానిని వరుసగా కూర్చున్న మగవారి తలపాగలో పెడతారు. ఆడవారైతే కొంగుకు కట్టుకుంటారు. మరికొందరు ఇంటి గుమ్మానికి కడుతారు. అనంతరం జొన్నరొట్టెలు చేసి డప్పు వాయిద్యాలతో తీజ్ నిమజ్జనానికి బయలు దేరుతారు. సమీపంలోని చెరువులు లేదా బావుల్లో నిమజ్జనం చేస్తారు. ఈ రోజు ప్రక్రియను 'తీజ్ ఎరాయెరో' పిలుస్తారు. దీనిని ఒకరకంగా లంబాడీ బతుకమ్మగా కూడా భావిస్తారు. గోర్‌బంజారాలు నిర్వహించే ఈ పండుగలో వారి సంస్కృతి ఉట్టిపడుతుంది. పంచకట్టు, ఖమీజ్ రుపాట్ ధరించి పురుషులు, టుక్రి, కాంచ్లీ, చేతులకు బలియాలు వేసుకుని యువతులు, సంస్కృతికి తగ్గట్టుగానే తయారవుతారు. గడ్డి బతుకమ్మను తెచ్చి ఆడపడుచులు సోదరుల కాళ్లు కడుగుతారు. ఆపై పారే నీటిలో గడ్డి బతుకమ్మలను వదులుతారు.

సంతోషంగా..



శ్రావణమాసంలో నిర్వహించే తీజ్ పండుగంటే మాకు ఎంతో ఇష్టం. బుట్టల్లో ఉన్న గోధుమలకు తొమ్మిది రోజులు నీళ్లు చల్లి చివరి రోజు ఉత్సవం జరుపుకుంటాం. ఇలా జరుపుకోవడం వల్ల అన్నికార్యాలు సిద్ధిస్తాయని పెద్దలు చెబుతున్నారు. పాడి పంటలతో పాటు ఇంటిల్లిపాది, గ్రామస్తులు సుఖశాంతులతో ఉంటారు.

– జే.దివ్యరాణి, చందుగూడ, కెరమెరి

ఈవో కార్యాలయం ప్రారంభం


కార్యాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

బాసర: బాసర ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఆలయ కార్యనిర్వహణాధి కారి కార్యాలయాన్ని శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో గోమాతతో భవన ప్రవేశం, వాస్తుపూజ, మహా హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేటి నుంచి నూతన కార్యాలయంలో అధికారులంతా విధులు నిర్వహిస్తారని ఆలయ ఏఈవో సుదర్శన్ గౌడ్ తెలిపారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, ఆలయ సీనియర్ అసిస్టెంట్లు, పీఆర్‌వో నారాయణ పటేల్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం..

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని దస్నాపూర్ కాలనీలో శుక్రవారం రాత్రి కొండచిలువ కనిపించడంతో భయాందోళన చెందిన స్థానికులు జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అధికారి సిబ్బందిని అప్రమత్తం చేసి కాలనీకి పంపించారు. జిల్లా అటవీశాఖ అధికారి సీసీ ఇసాక్ ఆధ్వర్యంలో బీట్ అధికారులు కిషోర్, ఎం.వెంకటేష్, మారుతి, పి.వెంకటేష్ గంటపాటు శ్రమించి దానిని ఒక సంచిలో బంధించి అటవీప్రాంతంలో వదిలేశారు. సమయానికి స్పందించిన అటవీ శాఖ అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

కంటెయినర్‌ను ఢీకొని యువకుడి మృతి

- రాఖీ కట్టించుకొని ఇంటికి వస్తుండగా ప్రమాదం
- బాసరలో పండుగపూట విషాదం


సాయిబాబు (ఫైల్)

బాసర/నవీపేట: రాఖీ పండుగను పురస్కరించుకుని ఓ సోదరుడు అక్కతో రాఖీ కట్టించుకొని స్కూటీపై తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం అబ్బాపూర్(ఎం) శివారులో చోటు చేసుకుంది. ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా బాసరకు చెందిన వర్గంటి సాయినాథ్, కవిత దంపతులకు కుమార్తె సాయిప్రియ, కుమారుడు సాయిబాబు అలియాస్ బబ్లూ (19) ఉన్నారు. రాఖీ పండుగ సందర్భంగా శనివారం బబ్లూ నిజామాబాద్‌లోని గాజుల్‌పేట్‌లో ఉంటున్న కవిత వద్దకు చిన్నాన్న కుమారుడైన అరవింద్‌తో కలిసి స్కూటీపై వెళ్లాడు. అక్కతో రాఖీ కట్టించుకొని తిరిగి వస్తుండగా అబ్బాపూర్(ఎం)–జగ్గారావు ఫారమ్ మధ్యలో ముందుగా వెళ్తున్న కంటెయినర్‌ను ఓవర్ టేక్ చేస్తూ వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో బబ్లూ కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి మేనమామ బలగం రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రాఖీ కట్టించుకునేందుకు వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నిర్మల్‌రూరల్: చెల్లితో రాఖీ కట్టించుకునేందుకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల మేరకు లోకేశ్వరం మండలం రాయపూర్ కాండ్లీకి చెందిన మహేష్ తనకు వరుసకు చెల్లెళ్లు అయిన అర్చన, ఆద్యతో కలిసి జిల్లా కేంద్రంలోని సోఫినగర్ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న అర్చన చెల్లెలు అక్షయతో రాఖీ కట్టించుకునేందుకు బైక్‌పై బయలుదేరారు. చిట్యాల వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. ముగ్గురు ఎగిరి కిందపడడంతో మహేష్, అర్చనకు తీవ్రంగా ఆద్యకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా అందుబాటులో లేకపోవడంతో ట్రాలీలో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అర్చన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాలలో శోధిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విషయం తెలుసుకుని..దాతృత్వం చాటి..


రక్తదానం చేస్తున్న సాయిరాహుల్

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ రూరల్ మండలం చిట్యాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన అర్చనను జిల్లా కేంద్రంలోని దేవేందర్ రెడ్డి ఆస్పత్రిలో చేర్పించారు. తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం జరగడంతో 'ఏ' నెగిటివ్ రక్తం అవసరమైంది. అరుదుగా లభించే ఈ రక్తగ్రూపు కోసం సామాజిక మాధ్యమాల్లో చేరవేయగా విషయం తెలుసుకున్న జిల్లా కేంద్రానికి చెందిన బండారి సాయిరాహుల్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. సమయానికి రక్తదానం చేసిన యువకుడిని పలువురు అభినందించారు..

నిర్మలం.. హృదయ రంజితం


గండిరామన్న హరిత పార్కు చుట్టూ పచ్చదనంతో అటవీ ప్రాంతం

ప్రకృతి శోభకు పెట్టింది పేరు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా. నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని ఈ అడవుల్లో ఉన్న చెట్లకు ఇటీవల కురిసిన వర్షాలకు పచ్చగా ఆకులు చిగురించి ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదం పంచుతున్నాయి. నిర్మల్ జిల్లా పరిసరప్రాంతాల ప్రజల హృదయాలను రంజింపజేస్తున్న ఈ ప్రకృతి చిత్రాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

జిల్లా కేంద్రం శివారులో పచ్చదనంతో అటవీ ప్రాంతం



ఆదివాసీ సంప్రదాయాలు భావితరాలకు అందించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- అధికారికంగా ఆదివాసీ దినోత్సవం


భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ


డప్పుచప్పుళ్లతో కలెక్టర్, ఎస్పీకి స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉట్నూర్‌లోని కుమురం భీం కాంప్లెక్స్‌లో ఉన్న సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అధికారిక వేడుకలకు హాజరయ్యారు. ముందుగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్ సింగ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీతో కలిసి భీం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని, ప్రపంచ ప్రసిద్ధి పొందాయన్నారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా పీవీటీజీ గిరిజనులు, ఒంటరి మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ప్రధాన మంత్రి జన్ మన్ పథకం ద్వారా 180 అంబులెన్స్‌లను పీవీటీజీ గ్రామాల్లో ఏర్పాటు చేశామన్నారు. పీవో మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పీవీటీజీ గిరిజనులకు ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా విద్య, వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆదివాసీల సంప్రదాయ బద్ధమైన పూజలు, గుస్సాడీ నృత్యాలు, డోలు వాయిద్యాలతో కుమురంభీం ప్రాంగణం హోరెత్తింది. ఈ కార్యక్రమంలో ఏపీవో మెస్రం మనోహర్, పేసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, సర్‌మేడీలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో..

మండల కేంద్రంతో పాటు ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆదివాసీ నాయకులు కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన మోర సాయి (32) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. రాఖీ పండుగ సందర్భంగా రెండు రోజుల క్రితం అతని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్యాచార నిందితుడి గాలింపునకు ప్రత్యేక బృందాలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీచౌక్‌లో 78 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడి కోసం వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపడుతున్నారు. మహారాష్ట్ర వాసిగా అనుమానిస్తున్న నిందితుడు తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్ వైపు వెళ్లి ట్రెయిన్‌లో పరారైనట్లుగా పోలీసులు భావిస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సీసీ ఫుటేజీలో నిందితుడి కదలికలను గమనించినట్లుగా ఆయన పేర్కొన్నారు

నాగోబాకు నొవోంగ్ పూజలు


పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా మురాడి వద్ద మెస్రం వంశీయులు శనివారం నొవోంగ్ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మెస్రం వంశ పెద్దలు ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన చిరు ధాన్యాలతో నైవేద్యం తయారుచేసి నాగోబాకు సమర్పించారు. అనంతరం తమ గ్రామాలకు వెళ్లి నొవోంగ్ పూజలు చేయనున్నట్లు తెలిపారు. నొవోంగ్ పూజల చేస్తేనే ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన చిరుధాన్యాలను తెంపడం జరుగుతుందని మెస్రం వంశ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశ పెద్దలు కోసేరావ్, హనుమంత్‌రావ్, దేవ్‌రావ్, లింబారావు, నాగ్‌నాథ్, ఆనంద్‌రావ్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారం

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రెబ్బెన: పోరాటాల ద్వారానే సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బెల్లంపల్లి ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఇప్పటి వరకు డైరెక్టర్ స్థాయి అధికారులతో కమిటీ సమావేశాలు జరిపినా కార్మికులకు సంబంధించిన ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని, కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. సొంతింటి పథకం అమలు, ఆదాయపు పన్ను మాఫీ వంటి దీర్ఘకాలిక సమస్యలను ఎన్నికల్లో గెలిచిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికై 18 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. యాజమాన్యంతో ములాఖత్ అయి కార్మికులకు తీరని ద్రోహం చేస్తున్నారని, ఇచ్చిన హామీలపై గనులపై నిలదీయాలని పిలుపునిచ్చారు. జూలై 31న జరిగిన మెడికల్ బోర్డులో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కార్మికులందరికి రీ మెడికల్ నిర్వహించి అన్‌ఫిట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, ఏరియా కార్యదర్శి శివారెడ్డి, ఏరియా ఆర్గనైజర్లు ఎస్‌కే ఇనూస్, మరిశెట్టి దత్తు, పిట్ కార్యదర్శి ఎండీ ఆరీఫ్, ఖైరిగూడ పిట్ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు తిరుపతి, బాలేష్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

కడెంకు స్వల్ప ఇన్‌ఫ్లో

కడెం ప్రాజెక్ట్‌కు శనివారం 1,707 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వచ్చినట్లు ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 696.200 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. – కడెం

